క్లుప్తంగా

సీఐటీయూ జెండా ఆవిష్కరణ



ఏ.కొండూరు: ఏ.కొండూరులో మేడే వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆధ్వర్యంలో సీఐటీయూ జెండా ఆ సంఘ మండల కార్యదర్శి జట్టి వెంకేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను మారుస్తూ కార్మికులకు ఏ హక్కులు లేకుండా కాలరాస్తోందని ఆరోపించారు. ప్రజలపైమోయలేని భారాలుమోపుతూ కార్పొరేట్లకు వేలకోట్లు రాయితీల రూపంలో దోచిపెడుతోందని విమర్శించారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు, వీఓఏలు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల అభివృద్ధికి కృషి



కోటేశ్వరరావు

ముసునూరు: చేనేత కార్మికులను చైతన్య పరచి, వారి ఐక్యతకు కృషి చేస్తానని జాతీయ చేనేత ఐక్య వేదిక సంఘం నూజివీడు నియోజకవర్గ నూతన అధ్యక్షుడు మల్లవల్లి కోటేశ్వరరావు తెలిపారు. ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు సీలూరి రుషింగప్ప నూజివీడు నియోజకవర్గ అధ్యక్షుడిగా తనను నియమిస్తూ మంగళవారం నియామక ఉత్తర్వులు పంపినట్టు ఆయన తెలిపారు. ముసునూరు మండలం చెక్కపల్లిలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. చేనేతల చైతన్యం, ఐక్యత, అభివృద్ధికి మండల, గ్రామ కమిటీలను ఏర్పాటుచేస్తామని చెప్పారు. జెడ్పీటీసీ ప్రతాప్ వరికూటి, ఎంపీపీ ఆర్.కృష్ణ కుమారి సుబ్బారావు, వైస్ ఎంపీపీలు కె.రాజానాయన, పి.గంగాధర్, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు నాగవల్లేశ్వరరావు తదితరులు కోటేశ్వరరావును అభినందించారు.

కుష్టుపై అప్రమత్తంగా ఉండాలి



తిరువూరు: కుష్టు వ్యాధిగ్రస్తులకు సత్వర వైద్య సేవలందించాలని జిల్లా కుష్టు నివారణ అధికారి ఉషారాణి సూచించారు. మండలంలోని చౌటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం వైద్యారోగ్య సిబ్బందితో కుష్టు వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కుష్టురోగుల వివరాలను ఎప్పటికపుడు నమోదు చేస్తూ వ్యాధి వ్యాప్తి కాకుండా తగు జాగ్రత్తలు సూచించాలని కోరారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ పర్యవేక్షకురాలు ప్రశాంతి, జిల్లా కుష్టునివారణ విభాగ పర్యవేక్షకుడు ప్రతాప్‌కుమార్, చౌటపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి పూజిత, సీహెచ్ఓ దీనెమ్మ, పీహెచ్ఎన్ చందారాణి పాల్గొన్నారు.

5న రామాలయ శిఖర ప్రతిష్ట



చాట్రాయి: మండలంలోని జనార్దనవరం గ్రామంలో నిర్మించిన కోదండ రామాలయ ప్రతిష్ఠ కార్యక్రమాలు ఈ నెల మూడు నుంచి ఐదో తేదీ వరకు నిర్వహించనున్నారు. 3న దీక్షాధారన, పంచ గవ్య క్షీర అధివాసం పూజలు, 4న ప్రభాత బలహరణ, గ్రామోత్సవం, 5న స్వామి వార్ల విగ్రహాలయ శిఖర ప్రతిష్ఠ, 11 గంటలకు స్వామి వారి దర్శనం, అన్నదానం, రాత్రి 6.30 గంటలకు సీతారాముల కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ పాలక వర్గం సభ్యులు తెలిపారు.

ప్రకృతిసేద్యంతో నాణ్యమైన దిగుబడి

ఆంజనేయపురం(తిరువూరు): రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకాన్ని రైతులు తగ్గించి ప్రకృతి సేద్యం చేస్తే నాణ్యమైన దిగుబడి వస్తుందని ప్రకృతిసేద్య జిల్లా ప్రాజెక్టు మేనేజర్ విజయకుమారి కోరారు. మండలంలోని ఆంజనేయపురంలో మంగళవారం ప్రకృతిసేద్యంపై రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. రసాయనాలు వాడకంతో భూసారం తగ్గిపోయి పంటల దిగుబడిపై ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. సేంద్రియ ఎరువుల తయారీ, వినియోగంపై అవగాహన కల్పించారు. ప్రాజెక్టు అధికారి భాను, ఆంజనేయపురం గ్రామ సర్పంచ్ మామిడి కుటుంబరావు పాల్గొన్నారు.

ఘనంగా సత్యదేవుని కల్యాణోత్సవం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానం (పాతశివాలయం)లోని సత్యనారాయణస్వామి ఆలయంలో సోమవారం రాత్రి స్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. వైశాఖ మాసం ఏకాదశి రోజు స్వామి వారి కల్యాణం చేయడం ఆనవాయితీ. అందులో భాగంగా స్వామి వారి సన్నిధిలో పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను కల్యాణవేదికపై అధిష్టింపజేశారు. పలువురు దంపతులతో స్వామి సామూహిక కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

మారుతున్న బడి రూపురేఖలు

రూ.4.18 కోట్లతో అదనపు తరగతి గదుల నిర్మాణం

నూజివీడు: నాడు–నేడు తొలి విడతలో ప్రభుత్వం పాఠశాలల రూపురేఖలు మార్చి శభాష్ అనిపించింది. సర్కారు బడుల అభివృద్ధిని చూసి విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సైతం ఆశ్చర్యపోయారు. తమ సర్వీసులోనే ఇలాంటి వసతులు ఏ ప్రభుత్వం కల్పించలేదని విద్యార్థుల తల్లిదండ్రులు చర్చించుకున్నారు. ఇప్పుడు నాడు–నేడు రెండో విడతలో నూజివీడు మండలంలో మరిన్ని పాఠశాలలను ప్రభుత్వం తీర్చిదిద్దుతోంది.

పేద విద్యార్థులు చదువుకుంటున్న ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యావ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ముందు నాడు–నేడు పథకం ప్రారంభించి ఫేజ్–1లో మౌలిక సదుపాయాలను కల్పించారు. కార్పొరేట్ పాఠశాలను తలదన్నేలా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దారు. వసతులు కల్పించడంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులసంఖ్య గణనీయంగా పెరిగింది.ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం నాడు–నేడు ఫేజ్–2ను ప్రారంభించి విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండి, చాలినన్ని తరగతి గదులు లేని పాఠశాలలను గుర్తించి, ఆయా పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని చేపట్టింది.

రూ.4.18 కోట్ల మంజూరు

నాడు–నేడు ఫేజ్–2లో ప్రభుత్వ పాఠశాలల్లో అదీ ముఖ్యంగా హైస్కూళ్లలో అదనపు తరగతి గదులను నిర్మించేందుకు నూజివీడు మండలానికి రూ.4.18 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిధులతో 35 తరగతి గదులను నిర్మించనున్నారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా ఇంత పెద్ద ఎత్తున హైస్కూళ్ల అభివృద్ధికి కృషిచేసిన దాఖలాలు లేవు. పట్టణంలోని ఎస్ఆర్ఆర్ హైస్కూల్‌లో రూ.1.44 కోట్లతో 12 తరగతి గదులను, జెడ్పీ బాలికల హైస్కూల్‌లో రూ.1.08 కోట్లతో 9 తరగతి గదులను, గొల్లపల్లి హైస్కూల్‌లో రూ.94 లక్షలతో 8 తరగతి గదులను, మీర్జాపురం హైస్కూల్‌లో రూ.72 లక్షలతో ఆరు తరగతి గదులను నిర్మిస్తున్నారు. పట్టణంలోని జెడ్పీ బాలికల హైస్కూల్‌కు బాలికల జూనియర్ కళాశాల సైతం మంజూరైంది. దీంతో ఇక్కడ తరగతి గదుల కొరతను అధిగమించేందుకు రూ.1.08 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఆయా హైస్కూళ్లలో అదనపు తరగతి గది గదుల భవన నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.



నాడు–నేడు ఫేజ్–1లో అభివృద్ధి చేసిన ఎస్ఆర్ఆర్ హైస్కూల్ భవనం



నూజివీడు జెడ్పీ బాలికల హైస్కూల్లో రూ.1.08 కోట్లతో నిర్మిస్తున్న అదనపు తరగతి గదుల భవనం

ఒకవైపు జగనన్న విద్యాకానుక కింద విద్యార్థులకు యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోట్సులు, బ్యాగ్, షూలు, బెల్ట్ తదితర వాటిని ఉచితంగా అందిస్తూనే మరోవైపు పాఠశాలల్లో తరగతి గదుల కొరత లేకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ గదుల నిర్మాణం పూర్తయితే విద్యార్థులకు మరింత సౌకర్యవంతంగా ఉంటుంది. జాతీయ విద్యావిధానంలో భాగంగా ప్రాథమిక పాఠశాలలను హైస్కూళ్లలో కలిపినా తరగతి గదుల కొరత లేకుండా ఉంటుంది.

తరగతి గదుల కొరత తీరుతుంది



నాడు–నేడు ఫేజ్–2 ద్వారా నాలుగు హైస్కూళ్లలో నిర్మిస్తున్న తరగతి గదుల నిర్మాణం వల్ల విద్యార్థులకు తరగతి గదుల కొరత లేకుండా సౌకర్యవంతంగా ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తోంది. ఇప్పటికే పలు పాఠశాలల రూపురేఖలే మారిపోయాయి.

– సేవియా, డీవైఈఓ, నూజివీడు

ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేయాలి

సీపీఎం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ

మైలవరం: రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేయాలని సీపీఎం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ కోరారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు మైలవరం మార్కెట్ యార్డులో రైతులు ఆరబెట్టుకున్న తడిసిన ధాన్యం, మొక్కజొన్నలను సీపీఎం, రైతు సంఘం నాయకులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ రైతులు పండించిన పంటను మద్దతు ధరకు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం రైతులకు న్యాయం చేయాలని కోరుతూ రైతులతో కలిసి మార్కెట్ యార్డు వద్ద జాతీయ రహదారిపై నిరసన చేసేందుకు వెళుతుండగా మైలవరం సీఐ మోహన్‌రెడ్డి తన సిబ్బందితో అడ్డుకున్నారు. మొక్కజొన్నలు, ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు, కార్యకర్తలు నినాదాలు చేశారు. కృష్ణ, పీ.వీ. ఆంజనేయులు మాట్లాడుతూ ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తామని చెప్పారని, కానీ ఇంత వరకు ఒక్క గింజను కూడా కొనుగోలు చేయలేదన్నారు.



మార్కెట్ యార్డులో మొక్కజొన్నలు, ధాన్యం పరిశీలిస్తున్న డీవీ కృష్ణ, సీపీఎం నాయకులు

విషయాన్ని కలెక్టర్ ఢిల్లీరావు దృష్టికి నాయకులు తీసుకువెళ్లగా ఆయన స్పందించి మార్కెట్ ఏడీఎం కిషోర్‌ను మైలవరం పంపించారు. ఏడీఎం కిషోర్ ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డితో కలిసి మాట్లాడుతూ ధాన్యం, మొక్కజొన్నలు నాలుగు రోజుల్లో కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. రైతు సంఘం నాయకులు వజ్రాల వెంకటరెడ్డి, మండల కార్యదర్శి ఆర్. రమేష్‌బాబు, సీఐటీయూ మండల కార్యదర్శి చాట్ల సుధాకర్ పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థుల ఎంపిక ప్రక్రియ

మైలవరం: 2023–24 విద్యా సంవత్సరం నుంచి అన్ని ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం ప్రవేశాలు కల్పించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించిందని మండల విద్యాశాఖాధికారి పీ రత్న శ్యామ్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా రెండో విడత విద్యార్థుల దరఖాస్తులు స్వీకరణ గడువు పొడిగించినట్లు పేర్కొన్నారు. ఈ నెల ఆరో తేదీ నుంచి 15 వరకు విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు ఆన్‌లైన్లో పోర్టల్ ఓపెన్ చేస్తారని తెలిపారు. జీఎస్‌డబ్ల్యూఎస్ ద్వారా విద్యార్థుల దరఖాస్తులు ఎలిజిబిలిటీ ధ్రువీకరణ ఈ నెల16 నుంచి 20 వరకు, లాటరీ లిస్టును ఈ నెల 22న ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు. పాఠశాలలో విద్యార్థిని చేర్చుకున్నదీ లేనిదీ ఈ నెల 24 నుంచి 28వ తేదీ లోపు తెలియజేయనున్నట్లు తెలిపారు.

8 నుంచి గ్రంథాలయంలో సమ్మర్ క్యాంప్

నూజివీడు: స్థానిక ప్రథమశ్రేణి గ్రంథాలయంలో ఈ నెల 8 నుంచి జూన్ 16వ తేదీ వరకు సమ్మర్ కోచింగ్ క్యాంప్ నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. ఈ క్యాంప్ నిత్యం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కథలు, పుస్తకాలు చదవడం, పుస్తక సమీక్ష, డ్రాయింగ్, పేపర్ క్రాఫ్ట్, బొమ్మలు తయారు చేయడం, అతిథుల ప్రసంగాలు, కథలు రాయడంతో పాటు చెస్, క్యారమ్స్ వంటి ఆటలు ఆడిస్తామని తెలిపారు. క్యాంప్‌కు ఆరు నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులు హాజరుకావొచ్చని పేర్కొన్నారు. వారానికొక పోటీ నిర్వహించి క్యాంప్ ముగింపు రోజున బహుమతులు అందిస్తామని తెలిపారు.

నూరుశాతం రుణాల రికవరీ అభినందనీయం

కేడీసీసీ బ్యాంక్ చీఫ్ మేనేజర్ శ్రీనివాసరావు

ఊటుకూరు(గంపలగూడెం): ఊటుకూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మెంబర్ లొపెల్ రుణాలు నూరుశాతం రికవరీ కావడం అభినందనీయమని గంపలగూడెం కేడీసీసీ బ్యాంకు చీఫ్ మేనేజర్ తెనాలి శ్రీనివాసరావు పేర్కొన్నారు. బ్యాంకులో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు ఆలపాటి ఉమామహేశ్వరరావు, సీఈఓ వెంకట నరసయ్యకు చీఫ్‌మేనేజర్ శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీలో 695 మంది రైతులు తీసుకున్న రూ. 687.57లక్షల రుణాలను సకాలంలో చెల్లించినట్లు తెలిపారు. రుణాల రికవరీకి కృషి చేసిన పాలకవర్గం, సొసైటీ సిబ్బందిని ఆయన అభినందించారు. మేనేజర్ కంచర్ల కనక దుర్గ, సూపర్‌వైజర్ కొండయ్య, ఏసోబు పాల్గొన్నారు.



సొసైటీ అధ్యక్షులు, సీఈఓలను అభినందిస్తున్న చీఫ్ మేనేజర్ శ్రీనివాసరావు

పాల కేంద్రంలో నానో సిస్టమ్ ప్రారంభం

చాట్రాయి: పాడి రైతుల శ్రేయస్సు కోసం కృష్ణా మిల్క్ యూనియన్ పాల ధర పెంచిందని యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు తెలిపారు. మండలంలోని యర్రవారిగూడెం పాలకేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన నానో సిస్టమ్‌ను ఆయన ప్రాంభించారు. కార్యక్రమంలో తిరువూరు పాల శీతల కేంద్రం మేనేజర్ టి.సాంబశివమూర్తి పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి 8వ వార్డు కంచి చంద్రరావు వీధిలో పాతికేళ్ల తాగునీటి సమస్యకు మున్సిపాలిటీ అధికారులు మంగళవారం పరిష్కారం చూపారు. ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ సూచనలు, 8వ వార్డు కౌన్సిలర్ షీనాబేగం అభ్యర్థనతో మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు పైపులైన్ పనులకు ప్రతిపాదన పెట్టి రూ.7.20 లక్షలు మంజూరు చేశారు. మున్సిపాలిటీ ఏఈ సాయిగణేష్ అంచనాలు రూపొందించి పైప్‌లైన్ పనులు పూర్తి చేశారు. 25ఏళ్లుగా తాగునీటి సమస్యకు పరిష్కారం చూపిన ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, వార్డు కౌన్సిలర్ ఏంఏ షీనాబేగం, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నాయకులు ఎంఏ.బేగ్ పాల్గొన్నారు.



తాగునీటి పైప్‌లైన్ పనులు పర్యవేక్షిస్తున్న ఏఈ సాయి గణేష్

వేలంలో చేపల చెరువుకు రూ.14.55 లక్షలు

తోలుకోడు(మైలవరం): తోలుకోడులో చేపల చెరువుకు నిర్వహించిన వేలంలో రికార్డు స్థాయిలో రూ.14,55,000 పలికింది. తోలుకోడు గ్రామంలో ఊరి మధ్య ఉన్న చెవిటి చేపల చెరువుకు మంగళవారం బహిరంగ వేలం పాట నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఓబుల్‌రెడ్డి దుర్గారెడ్డి, మైలవరం ఈఓపీఆర్‌డీ కే పద్మావతి సమక్షంలో రెండు సంవత్సరాల కాల పరిమితితో వేలం పాట నిర్వహించారు. మాజీ సర్పంచ్ ఇనగంటి శోభన్‌బాబు రూ.14,55,000కు చెరువును పాడుకున్నారు.

చెట్లు నరికిన వారిపై కేసు నమోదు

ముసునూరు: రహదారులు భవనాల శాఖ ఆధీనంలోని చెట్లను అక్రమంగా నరికిన వారిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై ఎం.కుటుంబరావు తెలిపారు. మండలంలోని గోపవరం – మీర్జాపురం ఆర్‌అండ్‌బీ రహదారికి ఇరువైపులా, కాట్రేనిపాడు పంచాయతీ పరిధిలో ఉన్న చెట్లను పేరిచర్ల ఏసుబాబు తదితరులు కలిసి నరికి వేశారు. ఐదు నిద్ర గన్నేరు చెట్లను నరికి ట్రాక్టర్‌పై తరలించినట్టు ఆ శాఖ ఉప కార్యనిర్వహణాధికారి సీహెచ్ బాబూరావు మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

అకాల వర్షంతో పంట నష్టం

మైలవరం: అకాల వర్షాలకు రైతన్నలు తీవ్రంగా నష్ట పోయారని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు రేగళ్ల రఘునాథరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మైలవరం మార్కెట్ యార్డులో రైతులు తీసుకొచ్చిన ధాన్యం, మొక్కజొన్నను మంగళవారం బీజేపీ నాయకులు పరిశీలించారు. వర్షాల వలన రైతులు ఆర్థికంగా దెబ్బతింటున్నాడని, అధికారులు స్పందించి ప్రభుత్వ మద్దతు ధరకు వరి ధాన్యం, మొక్కజొన్నలు కొనుగోలు చేయాలన్నారు. కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్. యశ్వంత్, రైతుల శీలం కృష్ణారెడ్డి, అలవాల వెంకటరెడ్డి, నాయకులు పీ. వెంకటేశ్వరరావు, కూనాల యుగంధర్, వజ్రాల వెంకట కృష్ణారెడ్డి, జే. నరేంద్ర, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

48 మంది ఉద్యోగాలకు ఎంపిక

గుణదల (విజయవాడ తూర్పు): తమ కళాశాలలో బీబీఏ ఆఖరి సంవత్సరం విద్యార్థులు ఉన్నత ఉద్యోగాలకు ఎంపిక కావడం ఆనందదాయకమని ఆంధ్ర లయోల కళాశాల ప్రిన్సిపల్ ఫాదర్ కిషోర్ అన్నారు. కళాశాల ఆవరణలో మంగళవారం పలు సంస్థల ప్రతినిధులు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీబీఏ కోర్సుపూర్తి చేసిన విద్యార్థులు మంచి ఉద్యోగాలకు అర్హత సాధించారని తెలిపారు. టాటా, ఇండిగో సర్వీసెస్‌లో తమ కళాశాలకు చెందిన 48 మంది విద్యార్థులు అర్హత సాధించారని తెలిపారు. సుమారు 3 లక్షల వార్షిక ఆదాయం ఉండే ఉద్యోగాలు పొందడం ద్వారా యువకుల జీవితాలు స్థిరపడ్డాయని స్పష్టం చేశారు. అనంతరం ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. కళాశాలఅధ్యాపకులు సహాయభాస్కరన్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

రేపు పెద్దకొమిర ఆలయంలో విగ్రహ ప్రతిష్ట

పెద్దకొమిర(గంపలగూడెం): మండలంలోని పెద్దకొమిరలో నూతనంగా నిర్మించిన ఆలయాల్లో గురువారం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించేందుకు కమిటీ సభ్యులు తగిన ఏర్పాట్లు పూర్తిచేశారు. ఉదయం 7.10 గంటలకు గ్రామంలోని వెంకటాచలస్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ, నూతన ఆలయాల్లో దాసాంజనేయస్వామి, ముత్యాలమ్మ అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు.

రూరల్ స్టేషన్ ఇన్‌చార్జి ఎస్సైగా రాధాకృష్ణారెడ్డి

నూజివీడు: నూజివీడు రూరల్ స్టేషన్ ఇన్‌చార్జి ఎస్సైగా పట్టణ ట్రాఫిక్ ఎస్సై శాగం రాధాకృష్ణారెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత ఎస్సై తలారి రామకృష్ణ వారం రోజుల పాటు గ్రేహౌండ్స్ శిక్షణకు విశాఖపట్నం వెళ్లారు. దీంతో జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు రాధాకృష్ణారెడ్డికి రూరల్ స్టేషన్ బాధ్యతలు అప్పగించారు.

గృహనిర్మాణాలు వేగవంతం చేయాలి

ఆర్డీఓ ప్రసన్నలక్ష్మి

తిరువూరు: వైఎస్సార్ గ్రామీణ గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని తిరువూరు ఆర్డీఓ ప్రసన్నలక్ష్మి అధికారులను కోరారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం గృహనిర్మాణంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. తిరువూరు డివిజన్ పరిధిలో 1,400 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం ప్రారంభించలేదన్నారు. ఇందుకు కారణాలు పరిశీలించి వారు త్వరితగతిన పనులు చేపట్టే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. గృహనిర్మాణ అధికారులు ఇచ్చిన జాబితాలకు అనుగుణంగా తహసీల్దార్లు నివేశనస్థల స్వాధీనపత్రాలను సిద్ధం చేయాలన్నారు. ఇళ్లు నిర్మించుకునే వారికి ఇసుక, సిమెంటు, ఇనుము అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. గ్రామాల్లో గృహనిర్మాణ సామగ్రి నిల్వ చేసేందుకు అవసరమైన గోదాముల సదుపాయం కల్పించేందుకు ఎంపీడీఓలు ఏర్పాట్లు చేయాలని ఆదేశాలిచ్చారు. అనంతరం నాడు–నేడు పథకం కింద పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల భవనాల నిర్మాణం, సచివాలయాలు, ఆర్బీకేలు, వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణ పనుల ప్రగతిపై పంచాయతీరాజ్, మండల పరిషత్ అధికారులతో సమీక్ష నిర్వహించారు.



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ

వేసవి క్రీడా శిక్షణ శిబిరం ప్రారంభం

జి.కొండూరు: స్థానిక శాగం శివరామిరెడ్డి జెడ్పీ ఉన్నత పాఠశాలలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని పీడీ సీజర్‌రెడ్డి, పీఈటీ మాధవరావు మంగళవారం ప్రారంభించారు. ఈ శిబిరానికి మండల పరిధిలోని పలు గ్రామాల నుంచి 50మంది బాల,బాలికలు హాజరైనట్లు పీడీ సీజర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా వాలీబాల్, హ్యాండ్‌బాల్, బాల్ బ్యాడ్మింటన్, టేబుల్‌టెన్నిస్, టెన్నీకాయిట్ క్రీడలలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

నూజివీడులో..

నూజివీడు: ఏలూరు జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో పట్టణంలో ఐదు క్రీడల్లో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ప్రారంభమయ్యాయి. బాస్కెట్ బాల్, వాలీబాల్, హ్యాండ్ బాల్, బాల్ బ్యాడ్మింటన్, ఫెన్సింగ్‌లో శిక్షణ శిబిరాలను స్థానిక విక్టోరియా పురమందిరం గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నారు. ఈ శిబిరం ఈ నెల 30వ తేదీ వరకు కొనసాగనుంది. కోచ్‌లుగా ఎస్ లక్ష్మి, వి.వనజ, వి.శ్రీనివాస్, డి.సతీష్‌కుమార్, వాకా నాగరాజు వ్యవహరిస్తున్నారు.



జెడ్పీ హైస్కూల్లో వేసవి శిక్షణకు హాజరైన విద్యార్థులు

పైథాన్ లాంగ్వేజ్‌పై పట్టు సాధించాలి

మైలవరం: విద్యార్థులు పైథాన్ లాంగ్వేజ్‌పై పట్టు సాధించాలని లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు తెలిపారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్, రూడికాన్ స్కిల్ డెవలప్‌మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు ఆన్‌లైన్ పైథాన్ ట్రెనింగ్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు మాట్లాడుతూ విద్యార్థులకు పైథాన్ లాంగ్వేజ్ ఆవశ్యకతను, ఉపయోగాలను వివరిస్తూ భవిష్యత్‌ను వాటికనుగుణంగా తీర్చిదిద్దుకోవడానికి ఉపకరిస్తుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి మాట్లాడుతూ కళాశాలలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రోగ్రామ్ కన్వీనర్ డాక్టర్ వెంకటాద్రి మాట్లాడుతూ నిజ జీవితంలో పైథాన్ ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎం. శ్రీనివాసరావు, డాక్టర్ కరీముల్లా, నారాయణరావు, పాల్గొన్నారు.

వేగంగా భవన నిర్మాణ పనులు

ఆగిరిపల్లి: కనసానపల్లిలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్ర భవన నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన వికేంద్రీకరణతో ప్రజల సమస్యలను స్థానికంగానే పరిష్కరించేందుకు గ్రామ సచివాలయం భవనం, రైతు భరోసా కేంద్రం భవనం, వైఎస్సార్ హెల్త్ సెంటర్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. రైతు భరోసా కేంద్రం, గ్రామ సచివాలయాల భవనాల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. సచివాలయం, ఆర్బీకే, హెల్త్ సెంటర్ల నిర్మాణానికి రూ.75 లక్షలు ప్రభుత్వం కేటాయించింది. త్వరలోనే నిర్మాణ పనులు పూర్తి చేసి గ్రామ సచివాలయ భవనాన్ని అందుబాటులోకి తీసుకువస్తామని కాంట్రాక్టర్, వైఎస్సార్ సీపీ నాయకులు బజారు రాంబాబు తెలిపారు.



కనసానపల్లిలో తుది దశకు చేరుకున్న గ్రామ సచివాలయం, ఆర్బీకే భవనాలు

అక్రమ గ్రావెల్ తరలింపుపై చర్యలు తీసుకోవాలి

తోటమూల(గంపలగూడెం): తోటమూల సర్వే నంబర్ 17లో భూమిని తాము దీర్ఘకాలంగా ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్నామని, ఆ భూమిలో అక్రమంగా గ్రావెల్ తరలించే వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆక్రమణదారులు మంగళవారం మండల రెవెన్యూ కార్యాలయంలో డెప్యూటీ తహసీల్దార్ రాధికారాణికి వినతిపత్రం అందజేశారు. గ్రావెల్ తవ్వకం వలన తాము పంటలు పండించుకునే అవకాశం లేకుండా పోయిందని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయమై తహసీల్దార్ బాలకృష్ణారెడ్డిని ప్రశ్నించగా, విచారించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలో ఏ గ్రామంలో గ్రావెల్ తవ్వకానికి అనుమతి లేదని, నిబంధనలకు విరుద్ధంగా గ్రావెల్ తవ్వకం చేస్తే క్రిమినల్ కేసు నమోదు చేస్తామన్నారు.

పెండింగ్ కేసులు తగ్గించాలి

డీసీపీ విశాల్‌గున్ని

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): పెండింగ్ కేసులను తగ్గించాలని పశ్చిమ జోన్ ఇన్‌చార్జి డీసీపీ విశాల్‌గున్ని చెప్పారు. సీపీ టీకే రాణా ఆదేశాల మేరకు డీసీపీ మంగళవారం సత్యనారాయణపురం పోలీస్‌స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ నిర్వహణ, సిబ్బంది పనితీరు, వారి విధులు, ముఖ్యమైన కేసుల దర్యాప్తులోని పురోగతి, స్టేషన్‌లో నిర్వహిస్తున్న కేసు డైరీ, విలేజ్ రోస్టర్, వివిధ క్రైమ్ రికార్డ్స్‌లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. స్టేషన్ పరిసరాలు, సీజ్ చేసిన వాహనాలు, లాకప్ గదులు, కంప్యూటర్ గదిని తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం నిర్మాణదశలో ఉన్న పీఎస్ భవనాన్ని పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. డీసీపీ విశాల్‌గున్ని మాట్లాడుతూ బీట్స్ బాగా పెంచి స్టేషన్ పరిధిలో జరిగే రెగ్యులర్ క్రైమ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని, అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి సారించి నిఘా పెంచి పూర్తిస్థాయి నియంత్రణ చర్యలు తీసుకోవాలన్నారు. స్పందన ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని ఆదేశించారు. రైల్వేస్టేషన్ వంటి ముఖ్యమైన పరిసర ప్రాంతాల్లో తిరిగే అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ఏర్పాటు చేయాలన్నారు. పీఎస్ పరిధిలో రోజూ సాయంత్రం విజిబుల్ పోలీసింగ్, ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించి ప్రజలకు మేమున్నామనే భద్రత కల్పించాలని సిబ్బందికి సూచించారు.



ఎస్ఎన్‌పురం పీఎస్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న డీసీపీ విశాల్‌గున్ని

సవరణ

ది. 25-3-2023 సాక్షి దినపత్రిక, తిరువూరు జోన్ పేజీలో ప్రచురణ అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, తిరువూరు బ్రాంచ్ ప్రకటనలో ఎన్.టి.ఆర్. జిల్లా, తిరువూరు (మం), తిరువూరు కాపురస్తులు పెరుమాళ్ళ జయలక్ష్మి, W/o. పానుగుమాటి సత్యనారాయణ కి చెందిన ఆర్.ఎస్.నెం. 127/6 దాఖలా విస్తీర్ణం 352.68 చ॥గ॥ను 352.88 చ॥గ॥లుగా చదువుకోగలరు. కావున సవరించడమైనది.
చింతల వెంకటరెడ్డి, అడ్వకేట్, తిరువూరు, ఎన్.టి.ఆర్. జిల్లా. ఫోన్ : 94407 64148